క్లుప్తంగా

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ

దేవరాపల్లి: ఏ.కొత్తపల్లిలో కంచిపాటి వరహాల నాయుడు ఇటీవల మరణించడంతో అతని భార్య జయలక్ష్మికి తక్షణ సాయంగా రూ.10 వేలును సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ శనివారం అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మిగిలిన రూ.90 వేలను నామినీగా ఉన్న ఆమె ఖాతాలో జమ కానుందని సర్పంచ్ తెలిపారు. ప్రమాదశాత్తు, సహజ మరణ సమయంలో బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా కొండంత అండగా నిలుస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీలు వివరిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల: ప్రభుత్వ రాయితీలతో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం చింతలూరు గదబూరులో లేఅవుట్లను ఆమె పరిశీలించారు. ఇక్కడ 20 ఇళ్లు మంజూరు చేయగా, నేటికీ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ రాయితీలు వివరించి ఇల్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ లెక్కల సత్యనారాయణ, ఏవో రమేష్ బాబు వైఎస్సార్ సీపీ నాయకులు కాళింగ కల్యాణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కె.కోటపాడు: వైద్య సిబ్బంది ఇచ్చే ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా గుల్లేపల్లిలో శనివారం ఆయన 69 మంది రోగులను పరీక్షించారు. అచేతన స్థితిలో ఉన్న తొమ్మిది మంది ఇంటికి వెళ్లి వైద్య సేవలందించారు. అనంతరం గర్భిణులను పరీక్షించి జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా ప్రతీ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటరు సర్వే

నాతవరం: ఎన్నికలు కమిషనర్ ఆదేశాల ప్రకారం పోలింగ్ బూత్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల తప్పొప్పులను సరి చేయడమేగాక అర్హత ఉన్న వారిని ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు తెలిపారు. నాతవరం, మర్రిపాలెం, శృంగవరం గ్రామాల్లో శనివారం ఆయన ఓటర్ల సర్వేను పరిశీలించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. మండలంలో 65 పోలింగ్ బూత్ సిబ్బంది నెల రోజులపాటు నిర్వహించే సర్వే ద్వారా ఓటర్ల జాబితా తుది రూపకల్పన చేసేందుకు చక్కటి అవకాశమన్నారు. నిర్లక్ష్యం చేస్తే కమిషనర్ తీసుకునే చర్యలకు బాధ్యతలవుతారని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరి నాట్లకు జోరుగా దమ్ములు



మామిడిపల్లిలో దమ్ములు చేసి వరి నాట్లకు సిద్ధం చేసిన పొలం

దేవరాపల్లి: ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. వరి నారు ఏపుగా పెరుగుతుండటంతో నీటి సదుపాయం ఉన్న చోట దమ్ముల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీటితో మరి కొందరు పొలాల్లో దమ్ములు చేస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన ట్రాక్టర్‌తో చేస్తున్న దమ్ములు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పల్లపు ప్రాంత గ్రామాలైన వేచలం, మామిడిపల్లి, ఎం.అలమండ, ఎన్.జి. నగరం, కొత్తపెంట, బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామాల్లో దమ్ములు ముమ్మరంగా సాగుతున్నాయి.

సరుగుడు... లాభాల మెండు!

- రెట్టింపు ధరతో సాగుపై ఆసక్తి
- బిజీబిజీగా మారిన రైతులు
- ఖరీదైనా.. క్లోనల్, జింజర్ రకాల కొనుగోలు



చిలకవానిపాలెంలో కొత్తగా వేసిన సరుగుడు



పి.పొన్నవోలులో మొక్కలు వేస్తున్న రైతులు

రావికమతం: గతంలో ఎన్నడూ లేనివిధంగా సరుగుడు కలపకు రెట్టింపు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో చెరకు, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో చినుకులు పడుతుండటంతో ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో సరుగుడు ఏరియాగా ముద్రపడ్డ ఎర్రవాయి గ్రామాల్లోనూ పి.పొన్నవోలు, కుముందానిపేట, మర్రివలస, వమ్మవరం, తట్టబంద, కొత్తకోట, రావికమతం, గంపవానిపాలెం, జెడ్.కొత్తపట్నం తదితర గ్రామాల్లోనూ ఇంతవరకూ వందెకరాల్లో సరుగుడు నాట్లు పడ్డాయి. మిగిలిన గ్రామాల్లోనూ సైతం సరుగుడు సాగుపై దృష్టిసారించారు.

ఎంత కష్టమైనా..

ఇప్పటివరకూ సాధారణ సరుగుడు మొక్కలనే నాటిన రైతులు ప్రస్తుతం హైబ్రిడ్ రకాలైన క్లోనల్, జింజానియా, జింజుర్ కార్శి రకాలను సాగు చేస్తున్నారు. ఈ రకాలు ఏపుగా ఎదగడమే కాక, గాలివానలు తట్టుకుంటాయి. నాలుగేళ్లకే ఏపుగా ఎదిగి మంచి ధర పలుకుతోంది. సాధారణ రకం సరుగుడు నారు వెయ్యి మొక్కలు రూ.550- రూ.750 వరకు ఉండగా, క్లోనల్ రకం వెయ్యి రూ.3 వేలు, జుంజూర్ కార్శి రకం వెయ్యి నారు రూ.వెయ్యి చొప్పున ధర ఉంది. సాధారణ రకం నారు ఎక్కడి నుంచైనా సునాయాసంగా తెచ్చుకోవచ్చు. పెద్ద కట్ట కట్టి ఒకే సారి 20 వేల మొక్కలు ఒకబైక్‌పై తెచ్చుకోవచ్చు. జింజర్, క్లోనల్ రకాలను మాత్రం ప్రత్యేక ట్రేలలో తేవాల్సి ఉంటుంది. ఎంత కష్టమైనా ప్రత్యేక రకాలైతే పెట్టుబడికి కాస్త ఫలితముంటుందనే ఆశతో రైతులు వాటిపైనే దృష్టి సారిస్తున్నారు. మాకవరపాలెం, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, నర్సీపట్నం నుంచేగాక కాకినాడ సమీపంలోని ఉప్పాడ, అత్తరుపేట నుంచి నారు తెచ్చి ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు.

ధర రెట్టింపుతో....

ఈ ఏడాది సరుగుడు ధర రెట్టింపైంది. దీంతో రైతులు ఈ సాగుపై మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం బాజు రకం కర్ర టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేలు, సాధారణ రకం కర్ర రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ ఉండేది. ప్రస్తుతం రెట్టింపు ధరలున్నాయి. ముక్క లోడ్ సైతం రూ.5 వేలు పలుకుతోంది. దీంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారని అమిరెడ్డి సత్యనారాయణ, సోమిరెడ్డి చిరంజీవి, రాజు, సత్తిబాబు, పులకండం చిన్నబ్బాయి, మిరియాల సూరిబాబు తదితర రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

చెరకుకు పెట్టుబడి భారం వల్లే...

మండలంలో వరి తర్వాత చెరకు రెండో పంటగా ఉండేది. ప్రస్తుతం ఆ స్థానాన్ని సరుగుడు ఆక్రమించిందనే చెప్పాలి. ఎక్కడ చూసినా వరి, చెరకు సాగుభూముల్లో సరుగుడు కనిపిస్తోంది. సరుగుడుకు ఏడాది పాటు పెట్టుబడి పెడితే తర్వాత రైతులు దీమాగా ఉండవచ్చు. చెరకుకు దవ్వ నాటింది మొదలు, కలుపుతీత, తోటచుట్టు, గానుక, ఇలా ఆరు సార్లు కూలీలతో పెద్ద పెద్ద పనులు చేయించాలి. ఆ విధంగా చేస్తే కూలీ ఖర్చే ఎక్కువవుతుండటంతో చాలామంది సరుగుడుపై దృష్టి సారించారు.

గిట్టుబాటు గాక సరుగుడు వేశా..



గతంలో చెరకు, వరి రెండెకరాల్లో సాగు చేసేవాడిని. ఉమ్మడి కుటుంబం విడిపోవడంతో ప్రతి పనిని కూలీలతో చేయించడం వల్ల ఎకరానికి రూ.25 వేలు అయ్యేవి. గిట్టుబాటు కాలేదు. సరుగుడు ధర బాగుండటం, పైగా కార్శి రకం మొక్కలు రావడంతో సరుగుడు వేశాను.

–చిరంజీవి, రైతు, కొత్తకోట

కూలీల ఖర్చు భరించలేక



ఉపాధి పనులు వచ్చిన తర్వాత కూలీల డిమాండ్ పెరిగిపోయింది. రూ.350 ఉండే కూలి ప్రస్తుతం రూ.500 ఉంది. వ్యవసాయ పనుల్లో తిండి గింజలు వస్తాయి తప్ప పెద్దగా లాభాలు రావు. ఆ ఉద్దేశంతో ఈ ఏడాది నాలుగెకరాల్లో సరుగుడు వేశాను.

– పి.రాజు, రైతు, తోటకూరపాలెం, టి.అర్జాపురం

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్



ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ సమక్షంలో పార్టీలో చేరిన ఎర్రినాయుడు

సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక నాయకుడు పెట్ల ఎర్రినాయుడు రెండు కుటుంబాలతో కలిసి పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం ఇక్కడ ఆయనకు పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి పనితీరు నచ్చి పార్టీలో చేరానని నాయుడు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గణేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ 14వ వార్డు పరిధి సుబ్బారాయుడుపాలెం, అప్పన్నదొరపాలెం గ్రామాల్లో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి, మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనువాసరావు, వార్డు వాసులు ఘనంగా స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను అందజేశారు. సీసీరోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు. దశల వారీగా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, వివిధ కార్పొరేషన్ల స్టేట్ డైరెక్టర్లు షేక్ ఉన్నీసాబేగం, అర్జున్, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, పార్టీ నాయకులు యాదగిరి శేషు, కణితి అన్నపూర్ణ, లోకవరపు శారద, గంటా లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ బాబాసాహెబ్

నర్సీపట్నం: మహిళలు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ బాబాసాహెబ్ సూచించారు. పెదబొడ్డేపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో విశాఖ ఏయూ ఆధ్వర్యంలో మహిళల వ్యక్తిగత శుభ్రతపై స్వయం సహాయ సభ్యులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యక్తిగత శుభ్రత ద్వారా వ్యాధులు దరి చేరవని ఆయన తెలిపారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రంగా ఉండేందుకు తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది అందించాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. మెప్మా ఐబీ వరలక్ష్మి, ఎల్‌హెచ్.సందీప్, కోఆర్డినేటర్ రమాదేవి, సీఎల్ఆర్పీలు పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి మరిన్ని పథకాలు

దళిత కులాల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు



జిల్లా ప్రతినిధులను సన్మానిస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

నర్సీపట్నం: దళితుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్నీ పథకాలు అమలు చేయాలని దళిత కులాల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పి.రాంబాబు కోరారు. శనివారం నర్సీపట్నంలో దళిత ప్రతినిధుల డివిజన్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టరు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఇతరత్రా కార్యక్రమాలకు మళ్లించకుండా, దళితవాడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని కోరారు. నిలుపుదల చేసిన 29 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు చిట్ల చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా దళితులు అభివృద్ధికి నోచుకోవటం లేదన్నారు. రద్దు చేసిన సంక్షేమ హాస్టళ్లను అంబేడ్కర్ గ్రంథాలయాలుగా మార్పు చేయాలన్నారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఐక్యవేదిక నాయకులను సన్మానించారు. విశ్రాంత సీఐ, ఏఎస్‌డబ్ల్యూవో రాజాన అప్పారావు, ప్రసాదరావు, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు, ఐక్య వేదిక నాయకులు మార్తి అప్పలరాజు, గాతాడ సహాదేవుడు, నేతల నాగేశ్వరరావు, యర్రంశెట్టి పాపారావు, యాదగిరి దాసు పాల్గొన్నారు.

స్థానికేతరుల సాగు పట్టాలు రద్దు చేయాలి

దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లేటి పెంటారావు



పనసలపాడు గిరిజన, దళిత రైతులతో మాట్లాడుతున్న దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పెంటారావు

రోలుగుంట: మండలంలోని పనసలపాడు రెవెన్యూ లో గిరిజనులు, దళితులు సాగు చేసుకుంటున్న సర్వే నంబర్లు 2,3,4,6,8, 11లో స్థానికేతరులకు ఇచ్చిన పట్టాదారు పుస్తకాలను రద్దు చేయాలని, అందుకు కారకులైన తహసీల్దారుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లేటి పెంటారావు డిమాండ్ చేశారు. శనివారం బాధిత రైతులతో ఆయన మాట్లాడుతూ ఈ భూముల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బావులు, విద్యుత్ మోటార్లతో స్థానిక గిరిజనులు జీడి, మామిడి, సరుగుడు తదితర ఫలసాయంతో దీర్ఘకాలంగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. రీసర్వేలో వీరికి న్యాయం చేయకుండా స్థానికేతరులైన కొండ నారాయణరావు, భగవత్ మైత్రి కుమారి తదితరులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయడాన్ని ఖండించారు. దీనిపై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి న్యాయం చేయాలని డిమాండు చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, దళిత సంఘం నాయకుడు కె.మల్లేశ్వరరావు, దుర్గారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి పాల్గొన్నారు.

కార్యకర్తలు, బీఎల్‌ఏలు శ్రమిస్తే భారీ విజయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు

పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెట్లు వెన్నుముఖ వంటివారని, వారు మరింత శ్రమిస్తే రానున్న ఎన్నికల్లో భారీ విజయం సాధ్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం రావికమతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,25,000 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేశారన్నారు. సంక్షేమానికి దీటుగా అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలిపారన్నారు. అన్ని వర్గాల వారికీ అన్ని పథకాలందించి సంతృప్తిపర్చారన్నారు. దీనిని సరైన పోల్ మేనేజ్‌మెంట్‌తో ఓట్లుగా మలచుకోవాలని సూచించారు. చోడవరం నియోజకవర్గంలో 6,800 బోగస్ తొలగించడానికి బీఎల్వోలతో కలిసి బీఎల్‌ఏలు గట్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 86 బూత్‌లకు 86 బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. 86 పోలింగ్ బూత్‌ల పరిధి గ్రామాల్లో 213 రోజులు ఈ కార్యక్రమం నిర్వహించి రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచామన్నారు.

వలంటీర్ల వ్యవస్థపై పవన్ పిచ్చికూతలు..

ప్రభుత్వ పథకాలను పేదలకు అందివ్వడంలో విశేష కృషి చేస్తున్న వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే ఆదర్శనీయంగా ఉందని, దీనిపై పవన్ కల్యాణ్ పిచ్చి పేలాపన చేయడం దారుణమని విప్ ధర్మశ్రీ అన్నారు. చంద్రబాబుకు వలంటీర్‌గా ఊడిగం చేస్తున్న పిచ్చి పవన్ ప్రజల్లో గెలిచే దమ్ము లేక ఎవరైనా ఇస్తే ముఖ్యమంత్రి తీసుకుంటానని పేలాపనలు పేలుతున్నాడన్నారు. కరోనా కష్టకాలంలో వీరంతా హైదరాబాద్‌లో తలదాచుకుంటే, ప్రాణాలకు తెగించి వలంటీర్లు అందించిన సేవల వల్లే రాష్ట్రంలో మరణాల సంఖ్య తగ్గిందన్నారు. ఈ నెల 30న చోడవరంలో గడపగడపకు ముగింపు సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ పైల రాజు, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, మత్స భవానీప్రసాద్, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు,ముఖ్య నాయకులు రుత్తల బాపునాయుడు, గంటా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వంగ సాగు

కె.కోటపాడు మండలంలో 150 ఎకరాల్లో పంట



సింగన్నదొరపాలెంలో వంగ సాగు

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో వంగ సాగు ఆశాజనకంగా ఉంది. ప్రధానంగా నీటి లభ్యత గల సాగునీటి చెరువులు, వ్యవసాయ బావుల ఆధారంగా వంగ సాగు చేస్తున్నారు. కె.కె.అగ్రహారం, డి.అగ్రహారం, పింద్రంగి, లంకవానిపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, ఆర్లి, కె.సంతపాలెం, సింగన్నదొరపాలెం, పాతవలస గ్రామాల్లో 150 ఎకరాల్లో వంట పంట పండిస్తున్నారు. మూడు నెలల కాలవ్యవధిలోనే పంట దిగుబడి ప్రారంభమవుతోంది. పంట ప్రారంభ సమయంలో దుక్కులు, ఎరువులు, విత్తనాలు, సస్యరక్షణ చర్యలకు ఎకరానికి రూ.8 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలు వంగ పంటకు మేలు చేస్తాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.50 కోట్లతో డి.యర్రవరంలో సబ్ స్టేషన్

నాతవరం విద్యుత్ శాఖ జేఈ చంద్రమౌళి



నాతవరంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న జేఈ చంద్రమౌళి

నాతవరం: మండలంలో లోవోల్టేజీ సమస్య నివారించేందుకు పది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ జేఈ చంద్రమౌళి అన్నారు. నాతవరం పాఠశాల వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్నందున రూ.1.50 కోట్లతో డి.యర్రవరంలో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. ప్రస్తుతం మూడు సబ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. మండలంలో కేటగిరీ–1 మీటర్లు 15,498, కేటగిరీ –2 మీటర్లు 1408, కేటగిరీ –3 మీటర్లు 41, కేటగిరీ –4 మీటర్లు 481 మీటర్లు, కేటగిరీ 5 మీటర్లు 922 ఉన్నాయన్నారు. ఆయా వినియోగదారులకు విద్యుత్ సక్రమంగా సరఫరా చేస్తున్నామని, నెలకు రూ.60 లక్షలకుపైగా బిల్లులు వసూలవుతున్నాయన్నారు. లోవోల్టేజీ ఉన్న గ్రామాల్లో అదనంగా కొత్త ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. స్తంభాలకు శిథిలమైన కండక్టర్లను తొలగించి 25 కిలోమీటర్లు మేర కొత్తవి వేశామన్నారు. ఒరిగిపోయి శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించి 150పైగా కొత్తవి వేశామన్నారు. జగనన్న లేఅవుట్లలో 120 ఇళ్లకుపైగా మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. 25 లేఅవుట్లలో కొత్త విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు వేశామన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా పని చేసే ఇద్దరు లైన్‌మెన్లకు నోటీసులు ఇచ్చామన్నారు. వారి పనితీరులో మార్పురాకపోతే విధులు నుంచి తొలగిస్తామన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



చోద్యంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చోద్యంలో ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు

గొలుగొండ: చోద్యంలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉండటం వల్ల విద్యుత్ శాఖ అధికారులు శనివారం కొత్త ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు చేశారు. దీని వలన గ్రామంలో 450 కుటుంబాలకు విద్యుత్ సమస్య తీరింది. గ్రామంలో లోవోల్టేజీ సమస్య తరుచూ వస్తుందని సర్పంచ్ గోపాలకృష్ణ ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో కళ్లకలక కలవరం

మాడుగుల రూరల్: సీజనల్ పరిస్థితులు, వర్షాలు వల్ల కళ్లకలక సమస్య గ్రామాల్లో కలవర పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం వందలాది మంది బాధితులుగా మారుతున్నారు. వాతావరణంలో మార్పులు, కెమికల్ రియాక్షన్, అలర్జీ వల్ల వ్యాప్తి చెందుతుందని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాద్ తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారు చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలని, చేతితో నలపకూడదని, సబ్బు, ఇతర కాస్మోటిక్స్‌తో కడగకూడదని సూచించారు. కళ్లు ఎరుపుగా ఉంటే సాధారణ కంటి చుక్కల మందు వాడాలన్నారు. ఇవి పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కళ్లకలక సోకిన వ్యాధిగ్రస్తులు కళ్లద్దాలను వాడటం మంచిదన్నారు. దీనివల్ల ఇతరులకు సోకదన్నారు.

పోలీస్ స్టేషన్లో టీడీపీ నేతల గొడవ

నాతవరం: వివాహేతర సంబంధం విషయమై ఫిర్యాదు అందడంతో పోలీసులు యువకుడిని స్టేషన్‌కు రప్పించిన నేపథ్యంలో వివాదం చోటు చేసుకుంది. దీనిపై విచారణ చేస్తుండగా యువకుడు గోడ దూకడంతో కాలికి స్వల్ప గాయమైంది. అతడు టీడీపీకి చెందిన వాడు కావడంతో ఆ పార్టీ నాయకులు వెళ్లి తగిన వైద్యం అందించాలని కోరారు. అంతా సద్దుమణిగిన సమయంలో కొందరు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. యువకుడిపై చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీనిపై ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. దీనిపై ఇంతవరకు కేసు నమోదు చేయలేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఐఎఫ్‌పీ పాఠాలు

నక్కపల్లి : ప్రత్యేక అవసరాల పిల్లలకు వారికి అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నట్టు ఉపాధ్యాయిని షేక్ యాస్మిన్ తెలిపారు. శనివారం వారికి గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ టీవీ ద్వారా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) విధానంలో బోధన చేశారు.

గిరిజన గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం తాటిపర్తి ఆరోగ్య ఉప కేంద్రం పరిధి శంకరం పంచాయతీ శివారు కృష్ణంపాలెంలో కె.జె.పురం పీహెచ్‌సీ డాక్టరు ఎల్ శివప్రసాద్‌పాత్రుడు 60 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 13 మంది బీపీ, 11 మంది సుగర్ వ్యాధిగ్రస్తులను, ముగ్గురు దీర్ఘకాలిక రోగులు ఉన్నారు. అంగన్‌వాడీ, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ, హెచ్‌వీ హేమమాలిని, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, సహాయకుడు నీలాంబరం, ఏఎన్‌ఎం రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టరు ఎల్ శివప్రసాద్‌పాత్రుడు